సాక్షి గుంటూరు

ఆదివారం । 27 । ఆగస్టు । 2023




కుంకుమబండ్లతో గ్రామోత్సవం

పాలువాయి(రెంటచింతల): పాలువాయి గ్రామంలో ముత్యాలమ్మ తల్లి కొలువులలో భాగంగా శనివారం గ్రామస్తులు వైభవంగా కుంకుమ బండ్లతో గ్రామోత్సవాన్ని నిర్వహించారు.



కార్తికేయుని సేవలో..

మోపిదేవి(అవనిగడ్డ): మోపిదేవిలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని హైకోర్టు న్యాయమూర్తి సుజాత కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 522.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

29న గవర్నర్ రాక

ఏఎన్‌యూ : రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ఈ నెల 29వ తేదీన ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి రానున్నారు. గవర్నర్ పర్యటనను రాజ్‌భవన్ అధికారికంగా ఖరారు చేసింది. 29న ఉదయం 11 గంటలకు గవర్నర్ ఏఎన్‌యూకి చేరుకుంటారు. యూనివర్సిటీ చాన్సలర్ హోదాలో స్నాతకోత్సవంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.50 గంటలకు ఏఎన్‌యూ నుంచి బయలుదేరి 1.20 గంటలకు విజయవాడలోని రాజ్‌భవన్‌కు చేరుకుంటారు.

రేపు షూటింగ్ బాల్ జిల్లా జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మెన్ అండ్ ఉమెన్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కిషోర్‌బాబు శనివారం తెలిపారు. పోటీలను సోమవారం మంగళగిరిలోని వీటీజేఎం అండ్ ఐవిటీఆర్ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 8వ తేదీ నుంచి 10 వరకు నెల్లూరు జిల్లా కావలిలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 86399 22978 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కొల్లిపరలో 11.2 మి.మీ వర్షం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా కొల్లిపర మండలంలో 11.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా గుంటూరు తూర్పులో 1.2 మి.మీ వర్షం పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి... ప్రత్తిపాడు 5, కాకుమాను 4, మంగళగిరి 3.2, దుగ్గిరాల 2.8, చేబ్రోలు మండలంలో 1.6 మి.మీ చొప్పున వర్షం పడింది.

1న సామూహిక వరలక్ష్మీ వ్రతం

అమరావతి: పవిత్ర శ్రావణమాసంలో మూడవ శుక్రవారం స్థానిక అమరేశ్వరాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపీనాథ్ శర్మ శనివారం తెలిపారు. ఆలయ రెండవ ప్రాకారంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారిని అలంకరించి వందలాది మంది ముత్తయిదువులతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరింపచేస్తామన్నారు. పాల్గొనే భక్తులు ఆలయ కార్యాలయంలో ముందుగా తెలియచేయాలన్నారు. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకల్లా దేవాలయానికి రావాల్సి ఉంటుందన్నారు.

రేపటి నుంచి పీఈటీల స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

గుంటూరుఎడ్యుకేషన్: జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న పీడీలు, పీఈటీలకు ఈనెల 28 నుంచి స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో వ్యాయామ విద్యకు, క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్న ప్రభుత్వం వ్యాయామ ఉపాధ్యాయులకు సైతం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించాలని మొదటిసారిగా నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో నిర్వహించనున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న పీడీలు, పీఈటీలు హాజరు కావాలని ఆదేశించారు. గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వారికి గుంటూరులోని హిందూ కాలేజీ హైస్కూల్, పొన్నూరు నియోజకవర్గ పరిధిలో పెదకాకాని మండలం వెనిగండ్ల జెడ్పీ హైస్కూల్, ప్రత్తిపాడులోని జెడ్పీ హైస్కూల్, తాడికొండలోని ఎస్ఎస్‌వీ హైస్కూల్, మంగళగిరి మండలం నూతక్కిలోని జెడ్పీ హైస్కూల్, తెనాలిలోని కేఎస్ఎస్‌హెచ్ మున్సిపల్ హైస్కూల్లో జరిగే సమావేశాలకు ఆయా నియోజకవర్గాల పరిధిలోని పీడీలు, పీఈటీలు హాజరు కావాలని వివరించారు.

పేదల అభ్యున్నతే సీఎం లక్ష్యం

- వంకాయలపాడులో రూ.21.51 కోట్లతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల నిర్మాణం
- ప్రారంభించిన మంత్రులు విడదల రజిని, మేరుగ నాగార్జున

యడ్లపాడు: పేద, అణగారిన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన సాగిస్తున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. పల్నాడు జిల్లా వంకాయలపాడులో రూ.21.15 కోట్ల సాంఘిక సంక్షేమశాఖ నిధులు, మనబడి నాడు-నేడు నిధులు రూ.36లక్షలతో 8.5ఎకరాల్లో అత్యాధునిక వసతులతో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల వసతి భవనాన్ని మంత్రి రజిని, పాఠశాల భవనాన్ని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ప్రారంభించారు. సభలో తొలుత మంత్రి రజిని మాట్లాడుతూ పేదల పిల్లలు పనులు వదిలి బడిబాట పట్టేలా తల్లిదండ్రుల ఆలోచనల్లో మార్పు తెచ్చినది జగనన్న ప్రభుత్వం అన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో రాజాపేటలో గురుకుల పాఠశాల మొదటి కాగా, తాజాగా ప్రారంభించిన వంకాయలపాడు పాఠశాల రెండోదన్నారు. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలల్ని నాడు-నేడు కింద చేర్చి అన్ని వసతుల్ని కల్పిస్తున్నామన్నారు. వైద్య రంగంలో కూడా క్షేత్రస్థాయి నుంచి వైఎస్సార్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం,



వంకాయలపాడులో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు విడదల రజని, మేరుగ నాగార్జున

ప్రతినెలా రెండుసార్లు దర్శించడం, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు అన్నింటా పేదలకు వైద్యాన్ని మరింత చేరువ చేశారన్నారు. నాడు-నేడుకు రూ.16వేల కోట్లు, సెప్టెంబర్ నుంచి ఐదు మెడికల్ కాలేజీలను ప్రారంభించబోతున్నామన్నారు. సుమారు రూ.500 కోట్ల ఖర్చుతో మెడికల్ కాలేజీలను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. సీఎం వీటన్నింటిని ఎవరి కోసం చేస్తున్నారో ఆలోచన చేయాలన్నారు. పేదల పిల్లలు లాయర్లు, ఇంజినీర్లు, ఇతర రంగాల్లో రాణించాలనే లక్ష్యంతో విద్యను ప్రోత్సహిస్తున్నారన్నారు. విద్యతోనే పేదల తలరాతను మార్చాలనే బలమైన నమ్మకంతోనే ఆ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ పాఠశాల నిర్మాణం కోసం మన ప్రభుత్వం రూ.21.15 కోట్లు, నాడు-నేడు ద్వారా రూ.36 లక్షల నిధులు ఖర్చుచేసి 8.5 ఎకరాల్లో 500 మంది విద్యార్థులకు సరిపడా వసతి కల్పించినట్లు తెలిపారు.

పల్నాడు జిల్లాలో ఎంతో అభివృద్ధి

జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 1.57 లక్షల మందికి అమ్మ ఒడి ద్వారా రూ.250 కోట్లు, నాడు-నేడు తొలిదశలో రూ.150కోట్లు, రెండో దశలో రూ.350 కోట్లు ఖర్చు పెట్టనున్నామని తెలిపారు. రూ.22 కోట్లతో ఇంతటి సౌకర్యాల్ని కల్పించడం జరిగిందని, ఈ సదుపాయాల్ని సద్వినియోగం చేసుకుని పిల్లలు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం సాంఘిక సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ సాయినాగార్జున యాదవ్ విద్య విలువల్ని, దానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహాన్ని వివరించారు.

కార్యక్రమంలో గురుకుల స్కూల్ డీసీవో కె పద్మజ, మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు టి రాజేంద్రప్రసాద్, ఎం వీరారెడ్డి, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, జెడ్పీటీసీ ముక్తా వాసు, ఎంపీపీ పి ఝాన్సీ, వైస్ ఎంపీపీ నాజులా, సర్పంచ్ వి నరసింహారావు, ఎంపీటీసీ సభ్యులు బి బొల్లయ్య, పార్టీ నాయకులు విడదల గోపీ, గంటా శంకర్, సొసైటీ చైర్మన్ బి.శివరామకృష్ణ, గురుకుల పాఠశాల ఎస్ఎం కమిటీ చైర్మన్ బి శ్రీను, వైస్ చైర్మన్ విజయ్‌బాబు, ప్రిన్సిపాల్ టి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ విద్యా పథకాలు దేశానికే ఆదర్శం

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

ఏపీలో అమలు చేస్తున్న విద్యా పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. మూడు నెలల కాలంలోనే పల్నాడు జిల్లాలో ప్రారంభించిన రెండో పాఠశాల వంకాయలపాడు గురుకులం అన్నారు. విద్యా రంగంలో గత ప్రభుత్వ పాలనకు..ప్రస్తుత ప్రభుత్వ పాలన తీరుకు ఏపీ గురుకుల పాఠశాలలు చూస్తే తెలిసిపోతుందన్నారు. అసమానతలు పోయేలా నాడు-నేడుతో కోట్ల రూపాయలు విద్యారంగానికి వెచ్చిస్తూ పైసా ఖర్చు లేకుండా సకల సదుపాయాలతో ఉచిత విద్యాబుద్ధుల్ని కల్పించిన మహోన్నత వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా, ఆయన రచించిన రాజ్యాంగాన్ని మార్గదర్శకంగా తీసుకుని పారదర్శక పాలన సాగిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అన్నారు. బాబు హయాంలో పేదరికం 11.50 శాతం ఉంటే, జగనన్న ప్రభుత్వంలో 6శాతానికి తగ్గిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వంటి నిస్వార్థ రాజకీయ నాయకుడికి రాష్ట్ర ప్రజలందరూ అండగా ఉండాలన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు నాగార్జున, రజిని

ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

నగరంపాలెం: ఎస్ఐ ఉద్యోగాలకు నిర్వహించిన ప్రాథమిక పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు శనివారం దేహదారుఢ్య పరీక్షల ప్రక్రియ ప్రారంభమైంది. వేకువజామున 4.30 గంటల నుంచి అభ్యర్థులను గుంటూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ లోపలికి అనుమతించారు. ఐదు గంటల నుంచి అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలను, జిరాక్స్ నకళ్లను పరిశీలించారు. గుంటూరు రేంజ్ పరిధిలో 12,957 మంది అభ్యర్థులు అర్హత సాధించగా, అందులో 11,048 పురుషులు ఉన్నారు. తొలి రోజు పలువురికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. అభ్యర్థుల ఎత్తు, ఛాతీ కొలతలను యంత్రాలతో సరిచూశారు. కాళ్లకు కట్టే ట్యాగుల్లోని సెన్సార్ల ద్వారా పరీక్షించారు. అనంతరం 1,600 మీటర్లు, 100 మీటర్ల పరుగు పోటీలు, లాంగ్ జంప్ నిర్వహించారు. గ్రౌండ్ ఆవరణలో వైద్య సిబ్బంది, అంబులెన్స్‌లను ఏర్పాటుచేశారు. గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు, గుంటూరు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్, బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పర్యవేక్షించారు. వేకువజామున మొదలైన దేహదారుఢ్య పరీక్షల క్రియ సాయంత్రం వరకు కొనసాగింది. ఈ మేరకు పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. పరిసరాల్లో పోలీసులు పహారా నిర్వహించారు. ఐజీ మాట్లాడుతూ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు ప్రశాంతంగా మొదలైనట్లు చెప్పారు. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పోటీలు నిర్వహించేందుకు



పరుగు పోటీల్లో పాల్గొన్న అభ్యర్థులు



పరీక్షలకు హాజరైన అభ్యర్థులు



ఛాతీ కొలతలు పరిశీలిస్తున్న ఏఎస్పీ సుప్రజ

అన్ని రకాల మౌలిక సౌకర్యాలను అందుబాటులో ఉంచామని అన్నారు. ఆధునిక కంప్యూటరైజ్డ్ టెక్నాలజీతో డిజిటల్‌గా, పారదర్శకంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఎస్సై అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలకు 600 మంది హాజరుకావాల్సి ఉండగా 472 మంది హాజరయ్యారు. అందులో ఉత్తీర్ణత సాధించిన వారు 231 మంది ఉన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), కె.కోటేశ్వరరావు (ఏఆర్), శ్రీనివాసరావు (క్రైం), అశోక్ బాబు (ఒంగోలు ఏఆర్), రేంజ్‌లోని పలు జిల్లాల పోలీస్ ఉన్నతాధికారులు, ఐజీ కార్యాలయం సిబ్బంది, డీపీఓ మినిస్టీరియల్ సిబ్బంది, పలువురు సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పిటి మాస్టర్లు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పెట్ సీటీ స్కాన్‌కు టెండర్లు

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్‌లో పెట్ సీటీ స్కాన్ పంపిణీ చేసేందుకు టెండర్లను ఆహ్వానిస్తూ శనివారం ఏపీ ఎంఎస్ఐడీసీ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో పెట్ సీటీ స్కాన్ అందుబాటులోకి రావడం వల్ల రోగులకు ఎంతో మేలు జరుగుతోంది. ఈనెల 25 నుంచి సెప్టెంబరు 8వ తేదీ వరకు టెండర్లకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. సెప్టెంబరు 9న టెండర్లు ఓపెన్ చేయనున్నారు.

రేపు జగనన్న విద్యా దీవెన కార్యక్రమం

బాపట్ల : జగనన్న విద్యా దీవెన కార్యక్రమం సోమవారం ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని స్పందనహాలులో జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జిల్లాలోని ప్రజా ప్రతినిధులు పాల్గొన్నుంటారని తెలిపారు.

దుర్గగుడిలో ప్రత్యేక కుంకుమార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రావణ మాసంలో ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో చేస్తున్న కుంకుమార్చనలకు రద్దీ పెరిగింది. దుర్గగుడిలో నిత్యం లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చనలు జరుగుతాయి. శ్రావణమాసంలో రోజూ ప్రత్యేక కుంకుమార్చన చేస్తున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష కుంకుమార్చన వద్ద జరుగుతున్న విశేష కుంకుమార్చనల్లో శనివారం పెద్ద సంఖ్యలో ఉభయదాతలు పాల్గొన్నారు. అనంతరం వీరిని రూ. 300 క్యూలైన్ ద్వారా దర్శనానికి అనుమతించారు. శ్రావణమాసంలో నిత్యం ఉదయం 10 నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు ప్రత్యేక కుంకుమార్చన జరుగుతుందని అర్చకులు పేర్కొన్నారు.

రూ.1.04 కోట్ల బయో ఉత్పత్తులు సీజ్

యూనివర్సల్ క్రాప్ సైన్సెస్ నిర్వాహకునిపై కేసు నమోదు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు నగరంలోని కమ్మ శేషయ్య గ్రౌండ్, కార్మికుల కాలనీలోని రెండు గోడౌన్స్‌లలో ఎలాంటి అనుమతులు లేకుండా అనధికారికంగా తయారు చేస్తున్న బయో ఉత్పత్తుల గోదాముపై శుక్రవారం రాత్రి వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. దాడుల్లో యూనివర్సల్ క్రాప్ సైన్స్ కంపెనీ పేరుతో ఉన్న యువ ప్లస్, బ్లూమర్, వైరోకిల్, ట్రోఫీ, ఎక్సోడాస్, బ్లోమ్, ఎక్స్ట్రా పవర్, జియాన్ ఎస్‌పి, కింగ్ కోబ్రా, నియో గౌన్, హై ఈల్డ్, పీక్ ప్లస్, ప్రొటెజర్, యూనిసైడ్, కుబేరా, హంటర్, కోబ్రా ప్లస్, యూనిటాక్ ప్లస్ వంటి సుమారు 25 రకాల బయో ఉత్పత్తులకు సంబంధించిన బాటిల్స్, ప్యాకెట్లు, ముడి పదార్థాలను గుర్తించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వాధీనం చేసుకున్న బయో ప్రొడక్ట్స్, ముడి పదార్థాల విలువను క్షుణ్ణంగా లెక్కించారు. వీటి విలువ సుమారు రూ.1,03,67,460 వరకు ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. స్వాధీనం చేసుకున్న బయో ప్రొడక్ట్స్, ముడి పదార్థాలను లాలాపేట పోలీసులకు అప్పగించారు. జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అనధికారికంగా బయో ప్రొడక్ట్స్ తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల విక్రయాలపై కూడా ప్రత్యేక నిఘా పెట్టామని, వీటి అమ్మకాలు, తయారీదారులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. జిల్లాలో నకిలీలు లేకుండా చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. తయారీదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, లైసెన్స్ కూడా రద్దు చేస్తామన్నారు. యూనివర్సల్ క్రాప్ సైన్స్ నిర్వాహకునిపై లాలాపేట పోలీసుస్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గుంటూరు ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు, అర్బన్ ఏఓలు బి.అంజిరెడ్డి, బి.కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తెనపల్లి రూరల్ సీఐగా ప్రేమయ్య

నగరంపాలెం: పీసీఆర్, గుంటూరు జిల్లాలో ఉన్న పి.ప్రేమయ్యను పల్నాడు జిల్లాలోని సత్తెనపల్లి రూరల్ సీఐగా, చిట్టెం కోటేశ్వరరావును సత్తెనపల్లి రూరల్ సీఐ నుంచి రేంజ్ వీఆర్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఉత్తర్వులు జారీ చేశారు.

ఏసీ 'లా' కళాశాల ప్రిన్సిపాల్‌పై దాడి



పట్నంబజారు: ఏసీ లా కళాశాలలో నెలకొన్న వివాదం నేపథ్యంలో లా కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌పై దాడి ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట ఎస్‌ఐ షేక్ ఎండీ మీరజ్ తెలిపిన వివరాల ప్రకారం గత కొంతకాలంగా ఏసీ లా కళాశాల ప్రిన్సిపాల్‌గా గురవయ్య బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఆయన్ను ప్రిన్సిపాల్ విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. అసిస్టెంట్ ప్రిన్సిపాల్ పి.అమృత వర్షిణిని కళాశాల కరస్పాండెంట్ ఇన్‌చార్జిగా నియమించడంతో, ఆమె బాధ్యతలు తీసుకుంటున్న సమయంలో గురవయ్య, మరికొంతమంది కలిసి వివాదానికి దిగారు. ఈక్రమంలో అమృతవర్షిణి తలకు గాయమైంది. పోలీసులు రంగప్రవేశం చేసి నిలువరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గురవయ్య, జోని, నాగేంద్ర, వెంకటేశ్వరరావు, రవికిరణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అయితే తనను ప్రిన్సిపాల్ అమృతవర్షిణి కులం పేరుతో దూషించి, దాడి చేసి గాయ పరిచారని గురవయ్య తమ్ముడు వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆలోచన 'దివ్య'ం.. వివాహం ఘనం

దివ్యాంగుల ఇన్ఫో సొసైటీ ఆధ్వర్యంలో ఏకమైన దివ్యాంగ జంటలు



రసపుత్ర బాలాజీసింగ్ - తుమాటి శిరీష, సకలా బత్తుల గుణశేఖర్ - బుర్ర ప్రసన్నలక్ష్మి దంపతులను ఆశీర్వదిస్తున్న డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ

నెహ్రూనగర్: దివ్యాంగుల ఇన్ఫో సొసైటీ ఆధ్వర్యంలో గుంటూరులోని కోల్పింగ్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం దివ్యాంగ జంటలకు వివాహాలు జరిగాయి. వినుకొండకు చెందిన రసపుత్ర బాలాజీసింగ్, ఉయ్యూరుకు చెందిన తుమాటి శిరీష జంటకు, హైదరాబాద్‌కు చెందిన సకలా బత్తుల గుణశేఖర్, విశాఖపట్నంకు చెందిన బుర్ర ప్రసన్నలక్ష్మీల జంటలకు బంధు మిత్రుల సమక్షంలో వివాహాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రమణ యశస్వి నూతన దంపతులకు మంగళ సూత్రాలను అందజేశారు. తొలుత సొసైటీ ఆధ్వర్యంలో గతంలో వివాహాలు జరిగిన ఇద్దరు జంటలకు ఉత్తమ జంట కింద అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రెసిడెంట్ నాగశ్రీ మాట్లాడుతూ దివ్యాంగుల్లో మనోధైర్యం నింపేందుకు గతంలో వివాహాలు జరిగిన వారిని తీసుకువచ్చి వారిని సన్మానించుకోవడం జరిగిందన్నారు. దివ్యాంగుల వివాహాల కోసం సొసైటీ ప్రెసిడెంట్‌ను 8555810100 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఇంటింటికీ ఓటరు పరిశీలన ప్రక్రియ పూర్తి

తాడికొండ, రాయపూడిలో ర్యాండమ్ తనిఖీ నిర్వహించిన జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి



మరణించిన వారి ఓట్ల తొలగింపుపై కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

తాడికొండ: జిల్లాలో ఇంటింటికీ ఓటరు తనిఖీ ప్రక్రియ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం దాదాపు పూర్తయిందని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటర్ల తొలగింపు, డెత్ కేసుల తొలగింపు, షిఫ్టెడ్ ఓటర్లు, ద్వంద్వ ఓటర్లు తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు వివరాలను శనివారం మండల కేంద్రమైన తాడికొండ, తుళ్ళూరు మండలం రాయపూడి పోలింగ్ బూత్‌ల పరిధిలో దరఖాస్తులను ర్యాండమ్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తాడికొండ పోలింగ్ స్టేషన్ 63-65, తుళ్ళూరు మండలం రాయపూడి పోలింగ్ బూత్ 20 పరిధిలోని తొలగించిన ఓటర్ల కుటుంబ సభ్యుల ఇళ్లకు వెళ్లి వివరాలు అడిగగా బీఎల్ఏలు తమ ఇళ్ళకు వచ్చి సరైన వివరాలు సేకరించడం జరిగిందని తెలిపారు. తొలగించిన ఓట్లు అన్నిటికీ ఫారం-7లు తీసుకొని, చనిపోయిన వారికి సంబంధించి డెత్ సర్టిఫికెట్లు సమర్పించారన్నారు. డూప్లికేట్ ఓట్లకు సంబంధించి ఓటరు అనుమతితోనే ఒకచోట ఉంచి మరోచోట ఓటు తొలగించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు తనిఖీ చేసిన ఓట్లకు సంబంధించి బూత్ లెవల్ అధికారులు, ఏఈఆర్వోలు, ఈఆర్వోలు మార్గదర్శకాల ప్రకారం అన్ని జాగ్రత్తలు తీసుకొని తొలగింపు ఓట్లకు సంబంధించిన దరఖాస్తులను పరిష్కరించడం జరిగిందన్నారు. 2022-23 ఏడాదిలో తొలగించిన, నమోదు చేసిన ఓట్లకు తప్పనిసరిగా దరఖాస్తులు ఉండాలని, మార్గదర్శకాల ప్రకారం పరిష్కారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎం వెంకట శివరామిరెడ్డి, డీటీ కాకుమాను ప్రసాద్ పలువురు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.